క్లుప్తంగా

అడ్వకేట్స్ బిల్లుపై మార్పులు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: బీఎన్ఎస్ఎస్, బీఎస్ఎస్ అడ్వకేట్స్ బిల్లుపై తక్షణ మార్పులు చేయాలని ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులు, ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్, పసుపులేటి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని శాస్త్రీ భవన్‌లో న్యాయశాఖ అదనపు కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అరెస్ట్‌కు ముందు నోటీసు ఇచ్చే నిబంధన నుంచి మహిళలపై నేరాలు, పోక్సో, సైబర్ నేరాలు, ఎన్‌డీపీఎస్ వంటి బహుళ నేరాలను మినహాయించాలన్నారు. దీనిపై శ్రీనివాస్ సానుకూలంగా స్పందించి న్యాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఆరోగ్యబీమా పథకంపై వినతి

తెలంగాణ న్యాయవాదుల ఆరోగ్య బీమా పథకంలో భాగంగా జిల్లాల వారీగా ఆస్పత్రులను పెంచాలని, రీయింబర్స్‌మెంట్ వేగవంతం చేయాలని న్యాయవాదులు కోరారు. సోమవారం ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షుడు, ఖమ్మం బార్ అసోసియేషన్ మెంబర్స్ తాళ్లూరి దిలీప్, పసుపులేటి శ్రీనివాస్ ఢిల్లీలోని మెడ్‌సేవా టీపీఏ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ బాధ్యులకు వినతిపత్రం సమర్పించారు. మెడ్‌సేవా అధికారులు దీపక్ కుమార్, గీత సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

గోవుల గ్రాసానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం ఓం శ్రీ కృష్ణ గోశాలలో పశుగ్రాసానికి ఖమ్మానికి చెందిన అకుల రామ్మోహన్ రావు, శ్రీలక్ష్మి, గోపినాథ్, తేజస్వినిలు రూ.11,116 ఆర్థికసాయం అందజేసినట్టు గోశాల బాధ్యులు కేసా హనుమంతురావు తెలిపారు. ఈ మేరకు సోమవారం దాత కుటుంబం గోశాలను సందర్శించి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోవులకు పశుగ్రాసానికి తమ వంతు సాయం అందించారు.

నివాళి..

నేలకొండపల్లి: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన జీ.వీరభద్రం మృతి చెందగా పలువురు ఆయన మృతదేహాన్ని ఖమ్మంలోని ఆయన నివాసంలో సోమవారం సందర్శించి నివాళులర్పించారు. నాయకులు ఏటుకూరి రామారావు, కెవీ.రెడ్డి, జెర్రిపోతుల సత్యనారాయణ, రావెళ్ల కృష్ణారావు, నాగరాజు, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్‌బాబు, పాకనాటి కన్నారెడ్డి, గుండా బ్రహ్మం, చెరుకూరి వీరభద్రం తదితరులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	తమ్ముడు
వినోద	ఏమాయె చేశావె, సూపర్‌మ్యాన్
సాయిరాం	కొత్తపల్లి ఒకప్పుడు
ఆదిత్య	జూనియర్
శ్రీనివాస	మై బేబీ, కుబేర

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	42	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	80		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	180		20
బీర	30	తోటకూర	4
దొండ	30		10
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	66		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		30
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	86	-ఖమ్మం వ్యవసాయం	

ట్రేడ్ లైసెన్స్‌లపై నజర్..



దుకాణంలో లైసెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న వార్డు ఆఫీసర్

వ్యాపారులను గుర్తించే బాధ్యత జవాన్లకు

- 3 వేల మందికి నోటీసులు ఇచ్చేందుకు చర్యలు
- ఆదాయం పెంచే దిశగా ప్రణాళిక

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ట్రేడ్‌లైసెన్స్‌ల జారీ, పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి వారికి అధికారులు నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు కేఎంసీ పరిధిలోని వ్యాపార సంస్థలు నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నాయో లేదో తనిఖీ చేయడానికి కమర్షియల్ భవనాలను పరిశీలించే బాధ్యత జవాన్లకు అప్పగించారు. ఇప్పటి వరకు 3 వేల మంది వ్యాపారులను అధికారులు గుర్తించినట్లు తెలిసింది. వారికి నోటీసులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అలాంటి సంస్థలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. జవాన్ల సాయంతో తనిఖీలను నిర్వహిస్తూ, ప్రతీ సంస్థకు లైసెన్స్ ఉందా లేదా అని నిర్ధారిస్తున్నారు. కమర్షియల్ ఇంటి నంబర్లు ఉన్న భవనాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారా? అలా చేస్తే వారికి లైసెన్సు ఉందా అనేది జవాన్లు పరిశీలించి వివరాలను నమోదు చేసుకొని ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించొద్దని, లేకుంటే జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనల అమలు, పారదర్శకత

వ్యాపారాలు నిబంధనలకు లోబడి పనిచేస్తున్నాయని నిర్ధారించడానికి ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి. ఈ తనిఖీలతో అక్రమ వ్యాపార కార్యకలాపాలను నివారించవచ్చని అధికారులు ఆశిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోడానికి కూడా అధికారులు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. నగరంలోని వ్యాపారులందరూ తమ లైసెన్సులను తనిఖీ చేసుకోవాలని, గడువు ముగిసినట్లయితే తక్షణమే పునరుద్ధరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారు తప్పనిసరిగా లైసెన్సు పొందాలని స్పష్టం చేశారు. కొత్త లైసెన్సు కోసం ఆన్‌లైన్‌లోనే నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, కార్యాలయానికి వచ్చే అవసరం కూడా లేదని అధికారులు సూచిస్తున్నారు.

ఆదాయం పెంచడమే లక్ష్యం..

లైసెన్స్‌లతో వచ్చే ఆదాయం కేఎంసీ ఆదాయ వనరుల్లో కీలక పాత్ర పోషిస్తోంది. నగరంలో భారీ సంఖ్యలో వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండి, వేలాది మంది వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. 5 వేల వరకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఒక కోటి రూపాయాలు మాత్రమే ఆదాయం వస్తున్నట్లు సమాచారం. ట్రేడ్‌లైసెన్సుల ద్వారా రూ.5 కోట్ల నుండి రూ.6 కోట్ల వరకు ఆదాయం వచ్చే వీలున్నా.. ఆ మేరకు లైసెన్సులు జారీ కావడం లేదని తెలుస్తోంది. దీంతో ఆదాయం కోల్పోతుందని భావించి, ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు.ఈ చర్యలతో పన్నుల వసూళ్లు పెంచి, నగర అభివృద్ధికి నిధులు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం..



ట్రేడ్ లైసెన్సులు లేని వ్యాపారులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఇప్పటికే జవాన్లకు ఈ బాధ్యతలను అప్పగించాం. లైసెన్సు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి వార్డు ఆఫీసర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వారి వద్ద ఉన్న ట్యాబ్‌ల్లో దరఖాస్తు చేసుకునేలా వ్యాపారులను ప్రోత్సహించాలని వార్డు ఆఫీసర్లకు సూచనలు చేశాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

కోతుల నియంత్రణకు ట్రాప్ ఏర్పాటు



చింతల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన మంకీ ట్రాప్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం శ్రీనివాసనగర్‌లో కోతుల నియంత్రణకు కార్పొరేషన్ సిబ్బంది ట్రాప్‌ను ఏర్పాటు చేశారు. ఈనెల 18న 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన ఫోన్ ఇన్‌లో స్థానికులు కోతుల సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు సిబ్బంది సోమవారం పర్యటించి కోతులు ఎక్కువగా సేదతీరే చింతల గ్రౌండ్‌లో ఇనుప జాలీతో కూడిన ట్రాప్ ఏర్పాటు చేశారు. ఇందులో వేరుశనగలు, ఇతర తినుబండారాలను వేయడంతో తినడానికి కోతులు రాగానే ట్రాప్ తలుపులు మూతపడతాయని తెలిపారు. ఆపై కోతులను అటవీ ప్రాంతానికి తరలిస్తారు. శ్రీనివాసనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ట్రాప్‌ల ఏర్పాటు, తరలింపునకు ఏపీ రాష్ట్రంలోని నెల్లూరుకు చెందిన వారితో కేఎంసీ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.

గోరింటాకు సంబురం..



గోరంటాకు వేడుకలో మహిళలు..



చేతులు చూపుతున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: ఆషాఢ మాసంలో మహిళల ప్రత్యేకం గోరింటాకు. గోరింటాకు వేడుకలు సోమవారం కొందరు సామూహికంగా జరుపుకున్నారు. ఈ మేరకు నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో గాండ్ల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళల సమూహం గోరంటాకు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు నృత్యాలు చేసి ఆనందాలు పంచుకున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.పరంజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, కామర్స్-2, కెమిస్ట్రీ -1, బోటనీ-1, తెలుగు-1, ఇంగ్లీష్-1, కంప్యూటర్ సైన్స్ -1, మ్యాథమెటిక్స్-1 పోస్టులకు ఈనెల 23 మధ్యాహ్నం 3 వరకు కళాశాలలో దరఖాస్తులు స్వీకరించబడతాయని పేర్కొన్నారు. పీజీలో కనీసం 55 శాతం (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం) మార్కులు సాధించి ఉండాలని, నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, బోధన అనుభవం కలిగినవారు సర్వీస్ సర్టిఫికెట్ జతపరచాలని తెలిపారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రాజీనామా

ఖమ్మం స్పోర్ట్స్: పదేళ్లుగా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న కళ్యాణపు ఆదర్శ్‌కుమార్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను సోమవారం ఆయన అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులకు పంపించారు. అనివార్య కారణాలతో అసోసియేషన్ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వలేకపోతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నానని అందులో తెలిపారు. అయితే, క్రీడాకారులకు కోచ్‌గా చేయూతనిస్తానని వెల్లడించారు.

మొక్కలు నాటి భవిష్యత్‌ను కాపాడాలి

ఖమ్మం మామిళ్లగూడెం: మొక్కలు నాటి భవిష్యత్‌ను కాపాడాలని చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పిల్లలు అన్నారు. ఈ మేరకు సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... జమాతే ఇస్లామి హింద్ తెలంగాణ పిల్లల విభాగమైన సీఐఓ ఆధ్వర్యంలో 'చేతులు మట్టిలో దేశభక్తి హృదయంలో' అనే నినాదంతో దేశవ్యాప్తంగా మిషన్ ప్లాంటేషన్‌లో భాగంగా 10 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను రూపొందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 27న ఖమ్మం ఉర్దూ ఘర్ షాదీఖానాలో జరుగుతుందన్నారు. సమావేశంలో జమాత్ ఏ ఇస్లామి హింద్ జిల్లా, స్థానిక బాధ్యులు, తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి నోచుకోని ఏజెన్సీ



మాట్లాడుతున్న అప్పారావు

కామేపల్లి: కాంగ్రెస్ హయాంలో ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఏజెన్సీలో ప్రాంత ఫలాలను జిల్లా మంత్రులు దోచుకుంటున్నారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కొత్తలింగాలలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.. సీతారామ ప్రాజెక్ట్‌తో ఏజెన్సీ ప్రాంతమైన కామేపల్లి మండలానికి గోదావరి జలాలు రాకుండా కాంగ్రెస్ మంత్రులు అడ్డుకొని వారి ప్రాంతానికి తరలించుకుపోయారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి చుండూరు రాజరాజేశ్వరి, మండలాధ్యక్షుడు పుచ్చకాయల సత్యనారాయణ, తోటకూరి వీరయ్య, ములకలపల్లి నాగయ్య, కృష్ణ, వెంకన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి హక్కులకు జంగ్ సైరన్ మోగిద్దాం..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ నీటి హక్కుల కోసం విద్యార్థి లోకం జంగ్‌సైరన్ మోగించాలని బీఆర్ఎస్‌వీ జిల్లా ఇన్‌చార్జి లింగనబోయిన సతీష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసే జలదోపిడీని అరికట్టేందుకు విద్యార్థి లోకం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిస్తూ రూపొందించిన పోస్టర్లను సోమవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా విద్యార్థి లోకానికి జలదోపిడీ వివరాలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు షారుక్, నగర బీఆర్ఎస్‌వీ ఇన్‌చార్జి ఎస్‌కె.మునాఫ్, బెల్లంకొండ గోపి, అఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా బోనాలు..



పూజలు చేస్తున్న కళాశాల సిబ్బంది

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం అంగరంగ వైభవంగా బోనాలు ఉత్సవాలు నిర్వహించిన్నట్టు కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నళిని, ప్రిన్సిపాల్ వి.రామారావు, అకడమిక్ డైరెక్టర్ ఎం.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలకు గుర్తింపు

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం 2024-25 సంవత్సరంలో చేసిన సేవలకు గాను గుర్తింపు లభించినట్టు సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఖమ్మం లయన్స్ క్లబ్‌కు అవార్డులు దక్కడంపై సోమవారం క్లబ్ కార్యాలయంలో అవార్డులను ప్రదర్శించి హర్షం వ్యక్తం చేశారు. 2వ బెస్ట్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, మొదటి బెస్ట్ కార్యదర్శిగా గెల్లా శ్రీరాం, మొత్తంగా 2వ బెస్ట్ క్లబ్‌గా ఖమ్మం లయన్స్ క్లబ్‌కు అవార్డులు దక్కడంతో క్లబ్ ప్రతినిధులు కొంకిమళ్ల విశ్వేశ్వర రావు, డాక్టర్ డీపీసీ రావు తదితరులు అభినందనలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో దయాకర్‌రెడ్డి తదితరులు

కూసుమంచి: మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కూసుమంచిలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ఈ సహాయం అంతుదుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూసుమంచి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నివాళి..

మండలంలోని గురువాయిగూడెం మాజీ సర్పంచ్ సారబుడ్ల నారాయణరెడ్డి మృతి చెందగా ఆయన మృతదేహాన్ని దయాకర్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

నగరంలో భారీ వర్షం..



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో కమ్ముకున్న కారుమబ్బులు

- పలు ప్రాంతాల్లో జలమయమైన రోడ్లు

ఖమ్మం నగరాన్ని సోమవారం వర్షం ముంచెత్తింది. మధ్యాహ్నం గంటకు పైగా కురిసిన వానతో నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగిపొర్లి రహదారులపైకి నీరు చేరడమే కాక చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. అలాగే, వైరా రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న కేఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది రోడ్లపై విరిగి పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. అంతేకాక పారిశుద్ధ్య కార్మికులు డ్రెయిన్లలో పూడిక తీసి నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.

– ఖమ్మం మయూరిసెంటర్ / స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కారుమబ్బుల కనువిందు..

తిరుమలాయపాలెం: వాతావరణ మార్పులతో సోమవారం కారుమబ్బులు కనువిందు చేశాయి. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మబ్బులు పట్టి భారీ వర్షం కరిసింది.



20వ డివిజన్‌లో విరిగిపడిన చెట్టుకొమ్మలు



కవిరాజ్ నగర్‌లో కచ్చా కాల్వ తీయిస్తున్న సిబ్బంది



చర్చి కాంపౌండ్ వద్ద వర్షంలోనే వెళ్తూ..

దోమల జోరు.. పల్లెలు బేజారు

- పంచాయతీల్లో కానరాని ఫాగింగ్
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- కార్యదర్శులకు తప్పని తిప్పలు

నేలకొండపల్లి: దోమలతో పల్లెలు బేజారవుతున్నాయి. అక్కడక్కడ డెంగీ, టైఫాయిడ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం పల్లెలో పాలకవర్గాలు లేకపోవటంతో ఆ లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ వర్షాకాలంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. దోమల నివారణకు నెలకు రెండు సార్లు ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఉంది. కానీ కొన్ని పంచాయతీల్లోనే ఫాగింగ్ చేస్తుండగా చాలా చోట్ల యంత్రాలు చెడిపోవటంతో మూలకు పడేశారు. దీంతో చాలా పంచాయతీలు ఫాగింగ్ కు దూరంగా ఉండటంతో దోమలు తాండవం చేస్తున్నాయి. ఏ పంచాయతీలో చూసినా డ్రైయినేజీలలో చెత్త చెదారం పేరకపోయి దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిల్వల కేంద్రంగా మారుతున్నాయి.

బంగారం తాకట్టు పెడుతూ..

దోమల నివారణకు ఒక్కసారి ఫాగింగ్ చేయటానికి వాడే రసాయనాల, ఇంధనం కోసం దాదాపు రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవటంతో ఈ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. ఫాగింగ్ చేయిద్దామన్న పంచాయతీలలో డబ్బులు లేవు. కనీసం ఆయిల్ బాల్స్ అయినా సరిపడినన్ని వేస్తే దోమలను కొంతైనా నివారించవచ్చు. కానీ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవటం, ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు రాకపోవటంతో పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. ఏ చిన్న సమస్య వచ్చినా ప్రజలు కార్యదర్శులను నిలదీస్తున్నారు. అవి తట్టుకోలేక కార్యదర్శులు అందినకాడికల్లా అప్పులు చేసి పంచాయతీకి ఖర్చు చేస్తున్నారు. ఇప్పటి వరకు చిన్న పంచాయతీలకు కనీసం రూ. 1 లక్ష వరకు అప్పులు పెట్టిన కార్యదర్శులు ఉన్నారు. కొంత మందికి చేసిన అప్పులు తీర్చలేదని వ్యాపారులు మొహం చాటేయటంతో చేసేది లేక ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి పంచాయతీ ఖర్చులకు ఉపయోగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక స్పెషల్ ఆఫీసర్లు ఉన్నా లేనట్టుగా ఉంది. కనీసం పంచాయతీ కార్యాలయంను సందర్శించిన వారు లేరంటే ఆశ్చర్యం కలగకమానదు. స్పెషల్ ఆఫీసర్ల ఆఫీస్‌లకు వెళ్లి సంతకాలు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





నేలకొండపల్లిలోని డ్రైయినేజీలో పేరుకుపోయిన మురుగునీరు

కాకరవాయిలో..



తిరుమలాయపాలెం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వస్తున్నా మండలంలోని కొన్ని గ్రామాల్లో మాత్రం అమలు కావడం లేదు. ఈ మేరకు శుక్ర, మంగళవారాల్లో గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు తూతూమంత్రంగా కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. శుక్రవారం నిర్వహించాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాలు కూడా గ్రామంలో చేపట్టలేదు. పంచాయతీ సమీపంలోని రోడ్డు వెంబడి బురద గుంతల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లిన పాపాన పోలేదు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



పంచాయతీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. అలా కాకుండా కార్యదర్శులపై అదనపు భారం పెట్టడం సరికాదు. నిధులు కేటాయించిన తరువాత స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి పారిశుద్ధ్యం పనులు శరవేగంగా చేయించాల్సిన అవసరం ఉంది.

– తోళ్ల సురేష్, నేలకొండపల్లి

ఫాగింగ్‌కు ఆదేశాలు జారీ చేశాం..



షెడ్యూల్ ప్రకారం ప్రతీ పంచాయతీలో ఫాగింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. పరిశుభ్రత పాటించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డ్రైయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. పారిశుద్ధ్యంపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

– యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి